క్లుప్తంగా

ఓటర్ నమోదు ప్రక్రియపై కలెక్టర్ ఆరా

కుత్బుల్లాపూర్: ఓటర్ నమోదు ప్రక్రియ విషయంపై మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ ఆరా తీశారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఫామ్ నెంబర్ 6, 7, 8 దరఖాస్తులతో పాటు ఒకే ఇంట్లో ఆరు ఓట్ల కంటే ఎక్కువగా ఉన్న వాటిని పరిశీలించి నివేదిక తయారు చేసిన విధానంపై బీఎల్ఓలతో మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 6లక్షల పైగానే ఓటర్లు నమోదు కాగా వీటిలో డబుల్ ఓట్లు ఉన్న వాటిని గుర్తించి తొలగించే ప్రక్రియ చేపడుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఆకస్మికంగా వచ్చిన కలెక్టర్ ఓటరు వెరిఫికేషన్ విషయంపై అధికారులతో చర్చించారు. జాయింట్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, ఆర్డీవో శ్యామ్‌ప్రకాష్, తహసీల్దార్ సంజీవరావు, ఉపకమిషనర్లు మల్లయ్య, మంగతాయారు తదితరులతో సమావేశం అయ్యారు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట


మహదేవపురంలో రోడ్డు మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్

సుభాష్‌నగర్: మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. మహదేవపురం-జె బ్లాక్ పరిధిలోని దేవేందర్‌నగర్‌కు వెళ్లే రహదారి మరమ్మతు పనులను మంగళవారం కార్పొరేటర్ పరిశీలించారు. రాకపోకలు సజావుగా కొనసాగేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు మురళీకృష్ణ, జగదీష్‌రెడ్డి, మధు, నరసింహ, గజేందర్, అంబాదాస్, రాజు, శ్రీకాంత్ తదితర పాల్గొన్నారు.

'ఘర్షణలు నివారించడంలో మణిపూర్ ప్రభుత్వం విఫలం'

నిజాంపేట్: బీజేపీ రాజకీయ లబ్ధి కోసమే ప్రజల మధ్య చిచ్చు పెడుతోందని సీపీఐ మేడ్చల్ జిల్లా కమిటీ సభ్యుడు వెంకటరామయ్య, బాచుపల్లి మండల సీపీఐ కార్యదర్శి శ్రీనివాస్ ఆరోపించారు. మణిపూర్‌లో జాతుల మధ్య ప్రజ్వరిలిన ఘర్షణలపై మంగళవారం బాచుపల్లిలో సీపీఎం, సీపీఐల ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. రిజర్వేషన్ల విషయంలో ఆదివాసీలు, మైదానంలో నివసించే ప్రజల మధ్య ఘర్షణలు తలెత్తాయని అన్నారు. ఎన్నో ఇళ్లు దగ్ధమైనా.. మహిళలపై ఆత్యాచారాలు జరిగినా.. వాటిని నివారించడంలో మణిపూర్‌లోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించ హింసకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు ఎం.చంద్రశేఖర్, బాలపీరు, వెంకటరాజ్యం, మల్లికార్జున్, స్వామి, మార్క్స్, సీపీఐ మండల నాయకులు అశి యాదయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లలితా సహస్ర నామాల పఠనం


కట్టమైసమ్మ ఆలయంలో శ్రీలలితా సహస్ర నామాలను పఠనం చేస్తున్న మహిళలు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్‌లో ఉన్న కట్ట మైసమ్మ ఆలయంలో మంగళవారం శ్రీలలితా సహస్ర నామాల పఠనం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ వివేక్‌రెడ్డి, శైలజారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేశారు. అనంతరం కొండల్‌రెడ్డి, శ్వేత దంపతులు అన్నదానం చేయగా భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చికిత్సపొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

జగద్గిరిగుట్ట: చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. గత శుక్రవారం ఆల్విన్‌కాలనీలో లాస్ట్ బస్టాప్‌లో స్పృహ కోల్పోయి ఓ వ్యక్తి పడి ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు అక్కడికి వెళ్లారు. చుట్టు పక్కల వాళ్లు ఆ వ్యక్తిని గుర్తు పట్టకపోవడంతో పోలీసులు చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కాగా మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. చనిపోయిన వ్యక్తికి సుమారు 25 సంవత్సరాలు ఉంటాయని, బ్లూ కలర్ టీషర్ట్, ఎరుపు కలర్ షార్ట్ ధరించి ఉన్నాడని, ఎవరైనా గుర్తించినట్లయితే సమాచారం కొరకు జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ సంప్రదించవచ్చని లేదా ఫోన్ నెంబర్ 8712663229, 9490617157 కి ఫోన్ చేయవచ్చని పోలీసులు తెలిపారు.



మొన్న.. నిన్న
సేమ్ టు సేమ్

ఓక్షిత్ ఎన్‌క్లేవ్‌లో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి సేమ్ సీన్ రిపీట్ అయ్యింది. ఎగువ భాగాన చెరువులు, కుంటలు పొంగిపొర్లడంతో రామారం పెద్ద చెరువు పొంగి ఉధృతంగా ప్రవహించింది. చెరువు కట్ట కింద ఉన్న ఓక్షిత్ ఎన్‌క్లేవ్ పూర్తిగా జలవలయంలో చిక్కుకుంది. దీంతో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కాలనీ ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. 6 రోజుల నుంచి కాలనీలోకి వరద నీరు పోటెత్తడంతో సంబంధిత అధికారులు ఎలాంటి సహాయక చర్యలు చేపట్టకపోవడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీంతో కొంతమంది ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయారు. మరికొందరు వరద నీరుటిలోనే కాలం వెళ్లదీస్తున్నారు. – సుభాష్‌నగర్



ఈఎస్ఐలో.. వైద్యుల కొరత!

- ఇబ్బందులు పడుతున్న రోగులు
- డిస్పెన్సరీలో 10మంది కంటే ఎక్కువ వైద్యుల అవసరం
- కేటాయించిన 10మంది వైద్యుల్లో నలుగురే విధులకు..
- ఇదీ జీడిమెట్ల ఈఎస్ఐ డిస్పెన్సరీ దుస్థితి

చింతల్: కార్మికుల ఆరోగ్య రక్షణకై కోట్లాది రూపాయలతో నిర్మించిన ఈఎస్ఐ ఆస్పత్రి వైద్యుల కొరతతో కొట్టుమిట్టాడుతోంది. కోట్లాది రూపాయలతో జీడిమెట్లలో నిర్మించిన ఈఎస్ఐసీ ఆస్పత్రిలో సరిపడా డాక్టర్లు లేకపోవడంతో ఆస్పత్రికి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ఈఎస్ఐ ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చే మరింత సుస్తీ చేస్తోందని రోగులు అంటున్నారు.

ఇప్పటికీ పాతికేళ్ల లెక్కనే..

గడిచిన ఇరవై ఏళ్ల క్రితం జీడిమెట్ల డిస్పెన్సరీలో సుమారు ఒక లక్షమంది కార్మిక కుటుంబాలు లబ్ధిదారులుగా ఉండగా పంది మంది డాక్టర్లను కేటాయించారు. రాను రాను జీడిమెట్ల డిస్పెన్సరీలో చికిత్స చేయించుకునేందుకు వచ్చే వారి సంఖ్య పెరుగుతూ వస్తున్నా వారికి సరిపడా వైద్యుల పెంపు లేకపోవడంతో డిస్పెన్సరీకి వచ్చే రోగులతో పాటు డాక్టర్లు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీడిమెట్లలో డిస్పెన్సరీ-1, డిస్పెన్సరీ-2లు ఏర్పడడంతో చందారులు (లబ్దిదారుల) సంఖ్య 4.50లక్షల రెంచి 5లక్షల వరకు చేరినా అదనపు వైద్యుల కేటాయింపు జరుగకపోగా ఇక్కడ కేటాయించిన వైద్యులు సైతం తగ్గిపోయి నలుగురికి చేరారు.

5లక్షల చందాదారులకు నలుగురే..

జీడిమెట్ల ఈఎస్ఐ డిస్పెన్సరీ-1, డిస్పెన్సరీ-2 లో కలిపి మొత్తం 20 ఏళ్ల క్రితం నాటి చొప్పున 10 మంది డాక్టర్లు ఉండగా నేడు నలుగురు మాత్రమే వైద్య సేవలు అందిస్తున్నారు. సుమారు 5 లక్షల చందాదారుల్లో ప్రతి రోజు 1200 నుంచి 1400 వందల మంది రోగులు జీడిమెట్ల ఈఎస్ఐ డిస్పెన్సరీకి వస్తుంటారు. సాధారణంగా ఒక డాక్టర్ 70 నుండి 100 మందికి వైద్యపరీక్షలు నిర్వహించే వెసులుబాటు ఉంటుంది. కానీ నేడు జీడిమెట్ల డిస్పెన్సరీ 1, 2 లలో ఒక్కో డాక్టర్ సుమారు 400 మందికి చెకప్ చేస్తుండటంతో ఆదరాబాదరాగా పరీక్షలు నిర్వహిస్తున్నారు.

శని, ఆదివారాల్లో రద్దీ ఎక్కువ...



చింతల్‌లోని జీడిమెట్ల ఈఎస్ఐ డిస్పెన్సరీ

ప్రతిరోజు 1200 మంది వస్తే సెలవు దినాల్లో మరింత రద్దీ పెరుగుతుంది. ఈ సమయంలో వైద్యులు విధులకు హాజరు కావడానికి భయపడుతున్నారు. ప్రతి రోజు 4 వందల మందికి పరీక్షలు నిర్వహించగా వారాంతంలో మరో 200 వందలు అదనంగా వస్తున్నట్లు తెలుస్తోంది. కాగా డిస్పెన్సరీ-1, 2లలో 5 లక్షల మంది చందాదారుల్లో నిత్యం 1200 నుంచి 1400 మంది వస్తుండగా ఆసుపత్రి ప్రాంగణంలో రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. దీంతో డిస్పెన్సరీలో మరో డిస్పెన్సరీ ఏర్పాటు చేసి మరో ప్రాంతంలో ఏర్పాటు చేయాలని ఆసుపత్రికి వచ్చే రోగులు డిమాండ్ చేస్తున్నారు.

నివేదిక పంపాం..

జీడిమెట్ల డిస్పెన్సరీలో డాక్టర్ల కొరతను ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. 20 ఏళ్ల క్రితం కేటాయించిన 10 మంది డాక్టర్లలో కేవలం 4 మాత్రమే ఉన్నారు. దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. డిస్పెన్సరీకి ప్రతినిత్యం వస్తున్న రోగుల రద్దీ దృష్ట్యా మరో డిస్పెన్సరీ ఏర్పాటు చేసి మరో చోట మారిస్తే రోగులకు ఇబ్బందులు తొలగే అవకాశముంది.

– రవీందర్‌గౌడ్, జీడిమెట్ల ఈఎస్ఐ ఇన్‌చార్జ్ మెడికల్ ఆఫీసర్

టాబ్ల్యూపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం షురూ


కార్యక్రమానికి హాజరైన అధ్యాపకులతో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి

దుండిగల్: కాలానుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం అవగతం చేసుకునేందుకు నిత్య విద్యార్థి మాదిరిగా అధ్యాపకులు మారాల్సి ఉంటుందని ఎంఎల్ఆర్ఐటీ కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి అన్నారు. దుండిగల్‌లోని కళాశాలలో టాబ్ల్యూపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను నిర్వహిస్తున్నారు. వారం రోజుల పాటు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో 5రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నామని ఈ ప్రోగ్రాంలో రాష్ట్రంలోని 320 మంది అధ్యాపకులు పాల్గొంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస రావు, రిసోర్స్ పర్సన్ ఆశిష్ కులకర్ణి, సీఎస్ఐటీ హెచ్‌ఓడీ సుభాషిణి, కో-ఆర్డినేటర్లు తులసి చిత్ర, నవ్య, స్పందన తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ తగ్గించడంలో రూ.వేల కోట్ల స్కామ్

కుత్బుల్లాపూర్: ప్రభుత్వం మెప్పు పొందడం కోసం అక్రమాలకు అధికారులు వత్తాసు పలికే విధంగా అధికారుల తీరు ఉందని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి అన్నారు. దూలపల్లి - బహదూర్‌పల్లి రోడ్డు విస్తరణను తగ్గించడంపై బీజేపీ కోర్టులో కేసు వేసిన విషయం విదితమే. అయితే దీనిపై ఉప కమిషనర్ మంగతాయారు స్పందిస్తూ రోడ్ల వెడల్పును తగ్గించే అధికారం ప్రభుత్వానిదేనని చెప్పడంతో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు మండిపడ్డారు. బాధ్యతాయుతమైన హోదాలో ఉన్న అధికారి ఇలా అక్రమార్కులకు అండగా మాట్లాడటం సబబు కాదన్నారు.

◆ రోడ్డు విస్తరణ తగ్గించడంలో రూ.2,400 కోట్ల స్కామ్ జరిగిందన్నారు. అందులో ఎందరు అధికారులు కుమ్మక్కయ్యారో తేలాల్సి ఉందన్నారు. రోడ్డు విస్తరణ వెడల్పు తగ్గించడంలో కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకుని కోర్టు తీర్పు వెలువరుస్తుందని మల్లారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు బక్క శంకర్ రెడ్డి, ఓబీసీ నాయకులు భానుచందర్, శ్రీధర్ వర్మ, డివిజన్ అధ్యక్షులు పులి బలరామ్, పత్తి సతీష్, సీనియర్ నాయకులు హనుమాన్ కచ్చవ, భీమ రాజు, సతీష్ తదితరులు ఉన్నారు.

మణిపూర్ ముఖ్యమంత్రిని బర్తరఫ్ చేయాలి


షాపూర్‌నగర్‌లో నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

సుభాష్‌నగర్: మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న మారణ హోమంపై ప్రేక్షక పాత్ర వహిస్తున్న ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని వెంటనే బర్తరఫ్ చేయాలని సీపీఐ మండల కార్యదరశి కీలుకాని లక్ష్మణ్, సీపీఎం మండల కార్యదర్శి ఉమామహేశ్ డిమాండ్ చేశారు. మణిపూర్‌లో కొనసాగుతున్న హింసా ఘటనలపై మంగళవారం షాపూర్‌నగర్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వందలాది మంది హత్యకు గురయ్యారని అన్నారు. ఎందరో మహిళలపై ఆత్యాచారాలు జరిగినా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మౌనంగా ఉండటాన్ని వారు తప్పుబట్టారు. బీజేపీ రాజకీయ దురుద్దేశంతో చేసిన రిజర్వేషన్ల ప్రకటనతోనే మణిపూర్‌లో హింస ప్రజ్వరిల్లిందని అన్నారు. దీనిపై ప్రధాని మోదీ వెంటనే స్పందించి బాధ్యులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం నాయకులు దేవదానం, జాకీర్, నర్సింహులు తిమ్మప్ప, సీపీఐ నాయకులు శ్రీనివాస్, వెంకటేష్, రాము, సుంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో ఎంఎల్ఆర్‌టీ విద్యార్థుల ప్రతిభ

దుండిగల్: ఎంఎల్ఆర్‌టీ కళాశాల విద్యార్థులు కె.సింధు, శ్రవంత్‌లు క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఇటీవల చెన్నైలో నిర్వహించిన జాతీయ స్థాయి ఫిస్ట్ పోటీల్లో పాల్గొన్ని కాంస్యం సాధించింది. మంచిర్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో శ్రవంత్, జ్ఞానదత్తు జోడి రాష్ట్ర స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని కళాశాలలో సెక్రటరీ మర్రి రాజశేఖరరెడ్డి, చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్‌రావులు ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి సంవత్సరం రూ.1.50 కోట్ల స్కాలర్‌షిప్‌లను అందించి క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగం హెచ్‌ఓడీ అచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ఫిట్ ఇండియా క్విజ్‌లో సత్తాచాటిన కెన్నడీ విద్యార్థులు

నిజాంపేట్: ఫిట్ ఇండియా క్విజ్-2022లో బాచుపల్లికి చెందిన కెన్నడీ గ్లోబల్ విద్యార్థులు సత్తా చాటారు. కేంద్ర క్రీడలు సమాచార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో కెన్నడీ గ్లోబెల్ స్కూల్ విద్యార్థులు ఎస్.మోహిని, అద్వైత్ హర్‌కార్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం కేంద్ర క్రీడలు సమాచార మంత్రిత్వ శాఖా మంత్రి అనురాగ్ సింగ్ థాకర్ చేతుల మీదుగా రూ.25వేల నగదు పురస్కారానికి అందుకున్నారు. ప్రతిభ కనబరిని విద్యార్థులకు కెన్నడీ స్కూల్ యాజమాన్యం రూ.2.5 లక్షల ప్రోత్సాహక బహుమతిని అందజేసింది. దేశ వ్యాప్తంగా నిర్వహించిన సెలక్షన్‌లో 72 మంది విద్యార్థులు ఎంపిక కాగా వారిలో కెన్నడీ స్కూల్ విద్యార్థులు ఉండటం గర్వంగా ఉందని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

కుత్బుల్లాపూర్ డీసీగా నాగమణి



కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్‌గా నాగమణి నియమితులయ్యారు. ఇక్కడ పని చేస్తున్న మంగతాయారు నగరంలో ఉన్న ప్రధాన కార్యాలయానికి బదిలీపై వెళ్లగా అల్వాల్ ఉపకమిషనర్‌గా పనిచేస్తున్న నాగమణి ఇక్కడికి బదిలీపై రానున్నారు. అయితే ఇటీవల జరిగిన బదిలీల్లో సత్యబాబు నార్సింగ్ నుంచి రావాల్సి ఉండగా ఆకస్మాత్తుగా నాగమణిని ఎంపిక చేయడంపై చర్చగా మారింది.

సన్మానం


గంపా శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న రేషన్ డీలర్లు

జగద్గిరిగుట్ట: నూతనంగా బాధ్యతలు చేపట్టిన బాలానగర్ ఏసీఎస్ఓ గంపా శ్రీనివాస్‌ను రేషన్ డీలర్ల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం బాలానగర్‌లోని కార్యాలయంలో మేడ్చల్ జిల్లా, బాలానగర్ సర్కిల్-1 రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు అముర ఇంద్రసేనా గుప్తా శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో మధుసుధన్ యాదవ్, నాగిళ్ల శ్రీనివాస్, రమేష్, శ్రీనివాస్ గౌడ్, అశోక్, అంజన్ గౌడ్, సొరేష్, ప్రవీణ్, చారి, వేణు, లక్ష్మీ కుమారి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

'మనూ'లో వర్క్‌షాప్

రాయదుర్గం: మనూలో టెస్టింగ్, మూల్యాంకనంపై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. 'మనూ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్(ఎస్ఈఅండ్‌టి), నేషనల్ టెస్టింగ్ సర్వీస్ ఇండియా(ఎన్‌టీఎస్-1) సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ (సీఐఐఎల్) సహకారంతో ఈ సదస్సును ప్రారంభించారు. అయిదు రోజుల పాటు కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. వీసీ ప్రొ.ఐనుల్ హసన్ మాట్లాడారు.

'టీహబ్'లో ఎంఓయూ

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో ఈఎస్‌జీ టెక్నాలజీ సొల్యూషన్స్‌ను అందించడానికి రెండు సంస్థలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ సమక్షంలో ఎక్విప్ సోషల్ ఇంపాక్ట్ టెక్నాలజీస్ లిమిటెడ్, సెనెకా గ్లోబల్ ఐటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల ప్రతినిధులు ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జయేష్‌రంజన్ మాట్లాడుతూ జాయింట్ వెంచర్ పట్ల ఆశాభావంను వ్యక్తం చేశారు.

అభివృద్ధి పనుల జాప్యంతో ఇబ్బందులు

- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

నిజాంపేట్: అభివృద్ధి పనులు నత్తనడకన కొనసాగడంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో ఎస్ఎన్‌డీపీ నాలా పనులు జరుగుతున్న ప్రాంతాలను సందర్శించారు. అసంపూర్తి ఎస్ఎన్‌డీపీ నాలా పనులు గత రెండేళ్లుగా భవ్యాస్ ఆనంద్, పాపయ్యకుంట, కౌసల్య కాలనీలలో నత్తనడకన కొనసాగడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందన్నారు.

◆ ఎస్ఎన్‌డీపీ నాలా పనులకు నిజాంపేట్ కార్పొరేషన్ నుండి రూ.30 కోట్ల కాంట్రాక్టర్‌కు ఇప్పించడంలో శ్రద్ధ చూపిన ఎమ్మెల్యే వివేకానంద్ సదరు పనులను త్వరిత గతిన పూరిచేయించడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. నిజాంపేట్ కార్పొరేషన్‌ను మోడల్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతామని గొప్పలు చెబుతున్న ప్రజాప్రతినిదులు ఇబ్బందులు పడుతున్న ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.


నిజాంపేట్‌లో ఎస్ఎన్‌డీపీ నాలా పనులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

◆ అదే విధంగా ప్రగతినగర్ శ్రీకృష్ణ గార్డెన్‌లో వర్షపు నీరు నిలిచిన ప్రాంతాన్ని పరిశీలించారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు సతీష్, జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు రామచంద్రనాయక్, పార్లమెంటుకు కన్వీనర్ డాక్టర్ రాజు, కార్యదర్శి శేషారావు, సోషల్ మీడియా కో కన్వీనర్ విజయ్, సాయి రెడ్డి, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు అశోక్ నాయక్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రసాద్ రాజు, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు కుమార్ గౌడ్, కార్యవర్గ సభ్యుడు విజయ్ తదితరులు ఉన్నారు.

'ప్రతి కార్యకర్తకు సీఎం కేసీఆర్ అండగా ఉంటారు'


ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజుకు సమస్యలు తెలియజేస్తున్న ప్రజలు


ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజును కలిసిన నార్సింగి ఏసీపీ లక్ష్మీనారాయణ

కుత్బుల్లాపూర్: పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్తకు ముఖ్యమంత్రి కేసీఆర్ అండగా ఉంటారని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుంటే ఓర్వలేక కొన్ని రాజకీయ పార్టీలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని అన్నారు. వాటిని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని ప్రజలు మంగళవారం శంభీపూర్‌లోని పార్టీ కార్యాలయానికి వచ్చి సమస్యలను ఆయనకు వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన అధికారులతో ఫోన్లలో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. అదే విధంగా మునుగోడులో పలు దేవాలయాల ప్రతిష్ఠాపన కార్యక్రమానికి రావాలని ఆ గ్రామస్తులు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రాజు మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్ బాధ్యతలు చేపడతారని అన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన నార్సింగి ఏసీపీ

శంభీపూర్‌లోని కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని నార్సింగి ఏసీపీగా బాధ్యతలు తీసుకున్న లక్ష్మీనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ఎమ్మెల్సీ శుభాకాంక్షలు తెలిపారు.

వెంటనే స్పందించిన అధికారులు



కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పరిధిలోని పైపులైన్ రోడ్డులో శ్వేత ఆర్యన్ అపార్ట్‌మెంట్ సమీపంలో కుంగిన రోడ్డు విషయమై సాక్షిలో ప్రచురితమైన కథనానికి జలమండలి అధికారులు స్పందించారు. మంగళవారం జలమండలి అధికారులతో కలిసి బీజేపీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నారు. భూమి కుంగిన ప్రాంతంలో పైపులైన్ ధ్వంసమైన విషయాన్ని గుర్తించిన అధికారులు కొత్త పైపులైన్‌ను ఏర్పాటు చేసే పనులు చేపట్టారు. ప్రజలకు ఇబ్బందులు కలుకుండా వేగవంతంగా పనులు పూర్తి చేయాలని భరతసింహారెడ్డి కోరారు.